అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 29 మార్చి 2023
1

నేషనల్ హైవే అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు

నవతెలంగాణ- కాసిపేట

మండలంలోని లంబాడితాండ(కే) శివారులో నిర్మిస్తున్న నేషనల్ హైవే రోడ్డు పనుల్లో భాగంగా సరైన విధానం లేకుండా కల్వర్ట్ నిర్మించడంతో మురుగు నీరు ఇళ్ల వద్దకు చేరి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు ఇళ్ల వద్దకు రావడంతో పాటు సాగు భూమిలోకి కూడా వచ్చి ప్రాంతం మొత్తం మురుగు నీరుతో నిండుకోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మురుగు నీరు ఇళ్ల ముందుకు, భూముల్లో రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పోషక పదార్థాలపై అవగాహన

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని ముత్తంపేట గ్రామంలో గర్భిణీలు, కిశోర బాలికలకు పోషకాహార విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెల్త్ సూపర్‌వైజర్ పావని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హీరాబేగం పాల్గొని పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భిణీలకు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక పదార్థాలను అందించాలన్నారు. గర్భిణులు సాధారణ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, వీటన్నింటికీ పోషక పదార్థాలే కీలకమని తెలిపారు. తాటిపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదె శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గర్భిణీలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి రైతుపై విత్తన కత్తి..!

- ఒక్కో ప్యాకెట్ ధరపై రూ.43పెంపు
- ఇప్పటికే పంట దిగుబడులు రాక అవస్థలు
- తాజా నిర్ణయంతో అన్నదాతలపై మరింత భారం

కాలం కలిసిరాక ఇప్పటికే కష్టాల ఊబిలో ఉన్న అన్నదాతలకు మరింత ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఏడాది పత్తి విత్తనాల ధర పెరగడం మరింత అవస్థలు తెచ్చిపెడుతోంది. ఈ ఏడాది ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెరగడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే పంట దిగుబడులు రాక అప్పుల పాలై అవస్థలు పడుతున్న అన్నదాతలపై మరింత భారం పడనుంది. ఇది వరకు ప్యాకెట్‌పై రూ.810గా ఉన్న ధర తాజాగా రూ.853కి పెరిగింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులపై సుమారు రూ.8కోట్ల వరకు భారం పడుతుంది. ఇప్పటికే కేంద్రం పత్తికి మద్దతు ధర పెంచకపోవడంతో రైతులకు గిట్టుబాటు లభించడం లేదు. కేంద్రప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కూడా రైతులకు ఎలాంటి మేలు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులే దిక్కుగా మారారు. తాజాగా విత్తనాల ధర పెరగడంతో చిన్న, సన్నకారు రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కోనున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పత్తి రైతుల కష్టాలు మరింత అధికం కానున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయి దిగుబడి తీవ్రంగా పడిపోయింది. ఎకరానికి కనీసం 10క్వింటాల్‌లు రావాల్సిన పత్తి దిగుబడి కేవలం 4 నుంచి 5క్వింటాల్‌లకు పరిమితమైంది. మరోపక్క వచ్చిన తక్కువ దిగుబడి పంటనైనా అమ్ముకుందామంటే మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లేకుండా పోయింది. ప్రభుత్వ మద్దతు క్వింటాల్‌కు రూ.6380 ఉండగా మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.7500వరకు పలికింది. కానీ మార్కెట్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.8300వరకు పలుకగా.. ఆ సమయంలో పంట ఇంటికి రాలేదు. దీంతో తక్కువ ధరకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి రావడంతో అనేక మంది రైతులు ఇప్పటికీ ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. మరోపక్క యాసంగిలో వేసిన పంటలు కూడా వడగండ్ల వర్షం తాకిడికి నేలవాలడంతో రైతులు మరింత నష్టపోవాల్సి వచ్చింది. తాజాగా పుండుమీద కారం చల్లినట్టుగా.. పత్తి విత్తనాల ధర పెరగడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. చిన్న, సన్న కారు రైతులకు మరింత ఆర్థికభారం పడనుంది.

రైతులపై రూ.8కోట్ల భారం..!

పత్తి విత్తనాలను ప్రయివేటు కంపెనీలే తయారుచేస్తుంటాయి. వాటి ద్వారానే మార్కెట్‌లో విత్తనాలు లభ్యమవుతుంటాయి. విత్తన తయారీ తదితర ఖర్చులను లెక్కించి ప్రభుత్వం విత్తన ధరలను నిర్ణయిస్తుంది. దీని ప్రకారమే ఆయా కంపెనీలు విత్తనాలు విక్రయించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఏటా రూ.25లక్షల ప్యాకెట్ల వరకు అవసరమవుతాయి. ఈ లెక్కన పెరిగిన ధరను పరిగణనలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లా రైతులపై సుమారు రూ.8కోట్ల వరకు భారం పడనుందని తెలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో 4.10లక్షల ఎకరాలు సాగవుతుండగా 8.20లక్షల విత్తనాలు అవసరమవుతాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3.20లక్షల ఎకరాల్లో సాగవుతుండగా 6.40లక్షల విత్తనాలు అవసరం ఉంటుంది. నిర్మల్‌లో 1.50లక్షల ఎకరాలకు గాను 3లక్షల విత్తనాలు, మంచిర్యాల జిల్లాలో 1.50లక్షల ఎకరాల్లో 3లక్షల సంచులు విత్తనాలు అవసరమవుతాయి. ముఖ్యంగా ఒక్కో రైతు ఎకరానికి 2సంచుల వరకు ఉపయోగిస్తుంటారు. అతివృష్టి లేదంటే అనావృష్టి ఎదురైతే వీటి కంటే ఎక్కువ సంచులు కూడా అవసరమవుతాయి. దీంతో రైతులు పత్తి విత్తనాలకు వెచ్చించే వ్యయం కూడా అధికంగానే ఉంటుంది. మరోపక్క పండించిన పంట గిట్టుబాటు కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడంతో పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



విత్తన ధరలు పెంచడం సరికాదు : అవినాష్, రైతు, పిప్పల్‌గావ్, జైనథ్ మండలం



పత్తి విత్తన సంచి ధరలు పెంచడం సరికాదు. ఇప్పటికే పత్తి పంట రోజురోజుకు తగ్గిపోతోంది. ఈ పంటపై పెట్టుబడి ఖర్చులు కూడా భారీగా పెరగడంతో పంట వేయలేని పరిస్థితి వస్తోంది. తాజాగా విత్తనాల ధరలు కూడా పెరగడం రైతులకు మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. ప్రభుత్వం జోక్యం చేసుకొని ధరలను తగ్గించాలి.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



నవతెలంగాణ-జన్నారం

తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం రోడ్డెక్కారు. ఖాళీ బిందెలతో మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. గత కొంతకాలంగా తమ కాలనీకి నీళ్లు రావడం లేదన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ జేఈ శ్రావ్య దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న సందర్భంలో రోడ్డుకి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో స్థానిక ఎస్సై పి.సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని, వారికి సముదాయించి ఆందోళన విరమింపజేవారు. అనంతరం స్థానిక ఎంపీపీ మాదాడి సరోజన ఆర్‌బ్ల్యూఎస్ శ్రావ్య రామ్‌నగర్ కాలనీలోకి వెళ్లి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళలకు మూడు రోజుల్లో మంచినీటి సరఫరాను చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలి : కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆస్పత్రి నిర్వాహన సరిగా లేకపోవటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని దేవుని గూడా గ్రామంలోని నర్సరీని పరిశీలించి వచ్చే హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక, రైతు వేదికలను సందర్శించి పలు సూచనలు చేశారు. ఉద్యోగులు విధులలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట దేవునిగూడా సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఇట్యాల కిషన్, ఎంపీఓ రమేష్, కార్యదర్శి సరిత, ఏపీఓ రవీందర్, విలాస్ పాల్గొన్నారు.

అవినీతికి అడ్డాగా నస్పూర్ మున్సిపాలిటీ

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ అవినీతికి అడ్డాగా మారిందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మంగళవారం వార్డుల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నస్పూర్ మున్సిపాలిటీకి రూ.కోట్ల ఆదాయం ఉన్న అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదని, ఎమ్మెల్యే దివాకర్‌రావు అండదండలతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడి ప్రజల సొమ్ము దోచుకుంటున్నారే తప్ప అభివద్ధి మాత్రం చేయడం లేదని విమర్శించారు. మున్సిపాలిటిలోని ప్రతి వార్డులో తాగు నీటి సమస్య, డ్రైనేజ్ సమస్య, రోడ్ల సమస్య తీవ్రంగా ఉన్న మున్సిపల్ పాలకవర్గానికి మాత్రం ప్రజా సమస్యలు పట్టడం లేదని అన్నారు. మున్సిపాలిటీలో శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడంతో కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజకు శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు అల్లాడుతున్న ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని అన్నారు. ఇక్కడి సింగరేణి నిధులతో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలకు తరలించి అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన మన ఎమ్మెల్యే, ఇక్కడి టీబీజీకేస్ నాయకులు మాత్రం నిధుల మళ్లింపు అడ్డుకోవడం లేదని ఆరోపించారు. సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ప్రజా మరుగు దొడ్లు నిర్మించాలని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవీతినికి పాల్పడకుండా మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ అగల్ డ్యూటీ రాజు, ఆనంద్ కృష్ణ, రజినిష్ జైన్, మోటపలుకుల తిరుపతి, జోగుల శ్రీదేవి, పిట్టల రవి, ఈర్ల సదానందం, సమ్రాజ్ రమేష్, మిట్టపల్లి మొగిలి, కర్రె చక్రి, తిప్పని భీమయ్య, రావనవెని శ్రీనివాస్, సిరికొండ రాజు, కడాసు భీమన్న, స్వప్నరెడ్డి, అడిచేర్ల రూపదేవి, కొండ వెంకటేష్, తారల విజయ్, రాజలింగు, పాషా, తాదురి మహేష్, బుద్దే మహేశ్వరి, రవి, కొరేపు మహేందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-దండేపల్లి

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ వయోజన విద్యా కేంద్రంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. స్వయం ఉపాధిని పొందాలనుకునే మహిళలకు ప్రభుత్వం తరపున గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేయడంతో పాటు కుట్టు మిషన్‌ల కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలు తమ గ్రామంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయుటకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన శాఖ ఇన్‌ఛార్జి విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఉపాధి కల్పన శాఖ అధికారి వెంకటరమణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వినోద్ కుమార్, తహసీల్దార్ హనుమంతరావు, పీపుల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిమల్ల ప్రకాశం, డీఆర్పీలు కొండు జనార్ధన్, వెంకటేశ్వర్లు, కందుల తిరుపతి, అశోక్‌రావు, శిక్షకురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

సింగరేణి నివాస క్వార్టర్ల తనిఖీ

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి కాలనీలో ప్రత్యేక కమిటీ సభ్యులు మంగళవారం పర్యటించారు. అక్రమంగా క్వార్టర్లలో నివాసముంటున్న వారిని ప్రశ్నించి వివరాలు అడిగి నమోదు చేశారు. మరికొన్ని రోజులు ఈ తనిఖీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో సెక్యూరిటీ మేనేజర్ ఎస్‌జీఎస్‌వి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ క్వార్టర్లలో నివాసముండేవారు సంబంధిత అనుమతి పత్రాలను తనిఖీ బృందానికి చూపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి జీకే కిరణ్‌కుమార్, జూనియర్ ఇన్స్‌పెక్టర్ జి చంద్రయ్య, సెక్యూరిటీ గార్డ్స్ రమేష్, జె శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

నేడు మైనార్టీలకు ఇంటర్వ్యూలు

సిర్పూర్(టి): తెలంగాణ మైనార్టీ కమిషన్ రుణాల కోసం బుధవార ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని ముందుకు సాగాలి

- మహిళ కమిషన్ సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని ముందుకు సాగాలని మహిళ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుంర ఈశ్వరిబాయి అన్నారు. మంగళవారం మండలంలోని సాలేగూడలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. చదువుతో పాటు వారి వారి సృజనాత్మకను వెలికి తీసే కార్యక్రమంలో ఎప్పుడు ముందుండాలన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించే పోటితత్వ పరీక్షలో పాల్గొని ప్రతిభ కనబర్చాలన్నారు. పోటీలలో ప్రతిభ కనబర్చినప్పుడే మనకు గుర్తింపు వస్తుందని, ఇప్పటి నుంచే తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక నిర్దేశిత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోని ఆ లక్ష్యం సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబచ్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈశ్వరిబాయిని పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, పీవీటీజీ ఏపివో ఆత్రం భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోతీరామ్, ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవాయిగూడ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏండ్లు పైబడిన వారందరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా ఇస్తారన్నారు. కంటికి సంబంధించి ఏ సమస్యలున్నా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అలాగే వైద్యులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి, ఏఎన్ఎం, ఆశావర్కర్ గ్రామంలో తిరిగి అందరికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ సందర్శించి పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదేవిధంగా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు పాఠాలు బోధించి క్రీడలు ఆడిపించారు. కార్యక్రమంలో మాధవాయిగూడ సర్పంచ్ దోబె పార్వతి, అంగన్‌వాడీ టీచర్ శకుంతల, సెక్రటరీ నరేష్, కార్యదర్శి నరేష్, వైద్యులు, వార్డుసభ్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదిగితే ఉపాధ్యాయులకు ఆనందం



సిర్పూర్(టి): విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలనేదే తమ కాంక్ష అని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. సమావేశంలో విద్యార్థులకు తల్లిదండ్రులతో ఆశీర్వాదాలు, 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు పెన్నులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో దేశ భవిష్యత్తు ఏర్పడుతుందనే మహనీయుడి సూక్తిని మనమందరం జ్ఞాపకం చేసుకోవాలన్నారు. విద్యార్థుల నుండి ఉపాధ్యాయులు వారి ఎదుగుదలనే కోరుకుంటారని, ఎలాంటి స్వార్థం లేకుండా వారి జ్ఞానాన్ని వారికి అందిస్తారన్నారు. ఉపాధ్యాయ వృత్తే సమాజాన్ని నిర్మించే వ్యవస్థని, పాఠశాలను విడిచివెళ్లే పదో తరగతి విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. నేటి ఆధునిక యుగంలో వస్తున్న సాంకేతిక విద్యను ఉపయోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మార్త రమేష్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులతో వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి డి సోమయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పరీక్షలంటే భయపడొద్దని, ప్రణాళిక బద్ధంగా చదివి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మండలానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం పలువురు పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం పదో తరగతి చదివే విద్యార్థులకు ఏ విధంగా చదువును కొనసాగించాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంచందర్‌రావు, సంతోషి రేఖ, శ్యాంరావు, సంతోష్‌కుమార్, సత్యనారాయణ, రాజాబాబు, రజిత, పరమేశ్వర్, సుమలత, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

అడ ప్రాజెక్టు ద్వారా సాగు నీరందించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



నవతెలంగాణ - వాంకిడి

అడ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగు నీరందించడానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. మంగళవారం అడ ప్రాజెక్టును స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అడ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుందని, రైతుకు అందాల్సిన సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో ఈ సారి కూడా వర్షాకాలం రాకముందే పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, జాదవ్, రాజేందర్, ముంజం ఆనంద్‌కుమార్, దుర్గం రాజ్‌కుమార్, సాయి, నాయకులు భీమేష్, సతీష్, పురుషోత్తం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలు పెంపొందించాలి

- జిల్లా విద్యాధికారి అశోక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలు పెంపొందింపజేయాలని జిల్లా విద్యాధికారి అశోక్ తెలిపారు. మండలంలోని పర్శునంబాల ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి తరగతుల వారీగా విద్యార్థుల గణిత ప్రక్రియలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలు పెంపొందింపజేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలు పెంచడంలో ఉపాధ్యాయులు కనబరుస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల ప్రహరీగోడ, మూత్రశాల నిర్మాణంలో జరుగుతున్న జాప్యం గురించి గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.కుమార్, సిబ్బంది హేమంత్ షిండే పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలు మంచివి : సీడీపీఓ వినూత్న



నవతెలంగాణ-ఉట్నూర్

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని సీడీపీఓ వినూత్న అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఉట్నూర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ పోషణ పక్షంలో భాగంగా కిషోర్ బాలికలకు స్థానిక ఏకలవ్య మోడల్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన సీడీపీఓ మాట్లాడుతూ చిరు ధాన్యాలలో పిండి పదార్థంతో పాటు ప్రోటీన్లు, పీచు పదార్థం, ఇనుము, క్యాల్షియం వంటి సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యానికి వీటిని ఆహారంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల వలన ఉపయోగాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు తగిన జాగ్రత్తలను పాటించాలని సూచించారు. పోషణ పక్షంలో భాగంగా చిరుధాన్యాలు వాటి ఉపయోగాలు గురించి వివరించారు. అలాగే కిషోర్ బాలికలలో రక్తహీనతను నివారించేందుకు మెడికల్ క్యాంపులను నిర్వహించి అనీమియా, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంతనపల్లి పీహెచ్సీ వైద్యురాలు డా. అనురాధ, ఆర్బీఎస్కే గంగాధర్, సూపర్ వైజర్ సంధ్యారాణి, కో ఆర్డినేటర్ పురుషోత్తం, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళన సభా స్థలం పరిశీలన



నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో ఈ నెల 31న నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన సభ స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. సభలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సెండె రాజ్‌కుమార్, ఎంపీటీసీలు ప్రవీణ్, మారుతి, సర్పంచ్‌లు కిష్టు, అయూబ్, కమలాకర్, మనోహర్, ఐటీడీఏ డైరెక్టర్ సోయం భీంరావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కొట్నాకె నేతాజీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళా కేంద్రాలకు వచ్చే మహిళలకు అన్ని పరీక్షలను టీ డయాగ్నోస్టిక్ ద్వారా చేయించాలని పూర్తి చికిత్సను అందించాలని సూచించారు. 8 ఆరోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. అవి సూక్ష్మ పోషక లోపాలు' శారీర బరువు నిర్వహణ, క్యాన్సర్ స్క్రీనింగ్, రొమ్ము క్యాన్సర్, మెనోపాజ్ నిర్వహణ, మూత్రనాల ఇన్ఫెక్షన్, రుతుస్రావ సమస్యల నిర్వహణ, సుఖ వ్యాధులు సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రధాన శాఖలు ఆరోగ్య, మెప్మా, మార్కెటింగ్, డీఆర్డీఏ, పట్టణ మున్సిపాలిటీల శాఖల సమన్వయంతో మహిళలు ఉపయోగించుకునే విధంగా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ నారాయణ నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో మంగళవారం వేకువజామున ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సైబర్ నేరాలు, పోలీసులు, ప్రజల సత్సంబంధాల గురించి వివరించారు. పోలీసులు నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో సరైన ధృవపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 10 ఆటో రిక్షాలు స్వాధీనపరుచుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి చట్ట విరుద్ధమైన పనులకు పాల్పడవద్దని, చట్టం ముందు ఎవరు అతీతులు కారని ఎలాంటి స్థాయిలో ఉన్న వారైనా తప్పు చేసినట్లయితే శిక్ష తప్పదని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్‌లో సర్కిల్ పరిధిలోని ఖానాపూర్, కడెం, పెంబి, ఎస్సైలు ఆర్.శంకర్, రాజు, రజనీకాంత్‌లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఏప్రిల్ 3వ తేదీన ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు 13వ తేదీ వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత అన్నారు. పదో తరగతి ఏర్పాట్ల నేపథ్యంలో నవతెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. గత సంవత్సరం వరకు పదో తరగతిలో 11 పేపర్లతో పరీక్షలు జరగగా, వాటిని ఈసారి 6 ప్రశ్నపత్రాలకు కుదించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. కాగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్‌ఈ.తెలంగాణ.గావ్.ఇన్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అన్నారు.

నవతెలంగాణ : పరీక్షకు ఎంత మంది హాజరవుతున్నారు? ఎన్ని పరీక్షా కేంద్రాలున్నాయి ?

డీఈఓ : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,608 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అందులో బాలురు 5,260, బాలికలు 5,347 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకు గాను జిల్లా వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.

నవతెలంగాణ : పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

డీఈఓ : అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించే ముందు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలిస్తాం, అలాగే విద్యార్థులకు తాగు నీరు, సౌకర్యం కల్పిస్తున్నాం.

నవతెలంగాణ : పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?

డీఈఓ : పరీక్షల నిర్వహణకు 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 13 మంది కస్టోడియన్‌లు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

నవతెలంగాణ :విద్యార్థుల కొరకు మీరు తీసుకున్న ప్రత్యేక చర్యలు ?

డీఈఓ :విద్యార్థులకు సిలబస్ పూర్తి చేశాం, ప్రత్యేక తరగతులు నిర్వహించాం, స్పెషల్ తరగతుల సమయంలో విద్యార్థులకు ఉదయం రాగిజావా, స్నాక్స్ ఏర్పాటు చేశాం.

నవతెలంగాణ : గత సంవత్సరం ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు? ఈసారి ఎంతశాతం వస్తుంది ?

డీఈఓ :గత సంవత్సరం 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాం. ఈసారి కూడా దానికంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం.

నవతెలంగాణ :దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు ?

డీఈఓ : దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామాల నుండి వచ్చేవారికి ఉదయం పూట బస్సులు నడుపాలని కోరారు. దానికి ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు అనుకూలమైన సమయాల్లో బస్సులు నడుపుతామని తెలిపారు.

నవతెలంగాణ :విద్యార్థులకు మీరిచ్చే సలహా సూచనలు ?

డీఈఓ : విద్యార్థులకు హల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలు రాయవచ్చు. విద్యార్థులు పరీక్ష సమయంలో ఆందోళన చెందవద్దు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దు.

ఆర్జీయూకేటీ డైరెక్టర్‌కు పేటెంట్



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో డైరెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న సతీష్ కుమార్ పేటెంట్ హక్కులు సాధించినట్లు మంగళవారం యూనివర్సిటీ పిఆర్‌ఓ విజయ్ కుమార్ తెలిపారు. డైరెక్టర్ సతీష్ కుమార్ పేటెంట్ సాధించడం పట్ల ఆర్జీయూకేటీ అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి సన్మానించారు. నోవెల్ ఇంటర్ లైన్ యూనిఫైడ్ పవర్ క్వాలిటీ కండిషనర్ ఫర్ మల్టీ ఫీడర్ సిస్టం విత్ ఫోర్ కన్వర్టర్స్ టెక్నాలజీ పై పేటెంట్ పొందినట్లు డైరెక్టర్ సతీష్ కుమార్ వివరించారు. మూడు సంవత్సరాలుగా పరిశోధనకు ఈ పేటెంట్ వచ్చిందని తెలిపారు.

వైస్ ఛాన్సలర్ అభినందనలు

యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ పేటెంట్ హక్కులను పొందడం పట్ల వైస్ ఛాన్సలర్ వెంకటరమణ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆర్జీయూకేటీ పరిపాలన సంబంధిత వ్యవహారాలు చూస్తూనే పరిశోధన రంగంలో ప్రతిష్టాత్మకమైన పేటెంట్లు సాధించడం యూనివర్సిటీకి ఎంతో గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ పావని, సృజన, విజయ్ కుమార్, శోభాదేవి, రాములు, చింతా నరేష్, శ్రీసుజై, రాహుల్, కార్తీక్, వినయ్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలను ప్రచారం చేయాలి

నవతెలంగాణ-జైనథ్



రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామ కమిటీలు కీలకమవుతాయని, గ్రామగ్రామాన ఆత్మీయ సమ్మేళనలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం నిరాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. 9 ఏళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో చర్చ పెట్టాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 19కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో బీఆర్‌ఎస్ గద్దెలను ఏర్పాటు చేసి జెండాలను ఎగరవేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేసింది శూన్యమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలను సిగ్గులేకుండా మావి అని చెప్పుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రైతు సమన్వయ జిల్లా అధ్యక్షులు రోకండ్ల రమేష్, మార్కెట్ చైర్మన్ వేణు యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, నిరాల గ్రామ సర్పంచ్ సునంద ప్రభాకర్ పాల్గొన్నారు.

రూ.3లక్షల విలువైన చెరుకు పంట దగ్ధం

నవతెలంగాణ-గుడిహత్నూర్

మండలంలోని తోషం గ్రామానికి చెందిన రైతు పస్తాపురే అశోక్ చెరుకు పంట విద్యుద్ఘాతంతో దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..ఎకరంలో చెరుకు పంట సాగు చేశాడు. పంట పైనుండి వెళ్తున్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పు రవ్వలు పంటపై పడడంతో మంటలు చెలరేగి చెరుకు పంట పూర్తిగా దగ్ధమైంది. రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరాడు.

రెండో రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామ దళిత రైతు రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి బొమ్మెన సురేష్ బాధిత దళిత రైతు కుటుంబ సభ్యులతో కలిసి నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ గ్రామ వీడీసీపై, సర్పంచ్‌పై, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని అన్నారు. ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అగ్రకులాధిపత్యం, పెత్తందారి, భూస్వామ్య విధానంతో వీడీసీ, గ్రామ సర్పంచ్, ప్రభుత్వ వ్యతిరేక చర్యకు పాల్పడితే అరెస్టు చేయాల్సినటువంటి అధికారులు వాళ్లకు అండగా నిలబడి దళిత రైతుకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. వెంటనే వారిని అరెస్టు చేయాలని, దళిత రైతు భూమిని దళిత రైతుకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడం, వీడీసీల వైపు ప్రభుత్వ అధికారులు నిలబడుతున్నారనేది అర్థమవుతుందని విమర్శించారు. ఒక రైతు 33 సంవత్సరాలుగా సాగులో ఉన్న భూమిని ఎలా ఆక్రమించి, వీడీసీ భవన నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ పట్టా కలిగిన భూమిని ఏ హక్కుతో వీడీసీ ఆక్రమించిందని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ విషయమై నిర్లక్ష్యం వహిస్తున్న లోకేశ్వరం మండలం తహసీల్దార్, ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షలో బాధిత దళిత రైతు కొబ్బనోళ్ల గంగన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. మంగళవారం స్థానిక హమాలివాడలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దృష్టిలోపం కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, కండ్లాద్దాలను అందించాలని అన్నారు. కంటి చూపు వలన ప్రతి ఒక్కరు వారి పనులను స్వయంగా నిర్వహించుకుంటారని, దృష్టిలోపం సమస్య లేకుండా ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఆశ, ఏఎన్‌ఎంలు వారి పరిధిలోని ఇంటింటికి తిరిగి కంటి పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాలలో హాజరు అయ్యే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. నిర్దిష్ట సమయానికి లక్ష్యాలను వందశాతం సాధించాలని అన్నారు. అవసరమైన వారికి ప్రిస్క్రిప్షైడ్ అద్దాలు త్వరలో అందజేసే విధంగా ఆన్‌లైన్‌లో ఇండెంట్ అందజేయాలని అన్నారు. అదే విధంగా మహిళల ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రవేశపెట్టి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, శస్త్ర చికిత్సలు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి మంగళవారం మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బందిచే మహిళలకు వైద్య చికిత్సలు నిర్వహించడం జరుగుచున్నదని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళామణులందరు సద్వినియోగ పరచుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని అన్నారు. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను నిర్భయంగా వైద్యురాలికి వివరించి, సత్వర, శాశ్వత వైద్య సేవలు పొందాలని అన్నారు. జిల్లాలో అక్రిడిటేడ్ మహిళా జర్నలిస్టులకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్క మహిళా వినియోగించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి ఒక మహిళకు సంబంధించిన వివరాలను, అందిస్తున్న వైద్య సేవలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీఎంహెచ్‌ఓ డా.నరేందర్ రాథోడ్, డా.శ్రావ్యవాణి, శ్రీకాంత్, అవినాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ఆలయాల అభివృద్ధి కృషి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- రంజిని గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-కుభీర్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయాంలోనే ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రంజిని గ్రామ పంచాయతీలో మార్కండేయ మందిర్ నిర్మాణానికి గ్రామస్తుల సహకారంతో దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ.35లక్షలతో ఆలయ నిర్మాణం, జాంగాం నుంచి రంజిని గ్రామం వరకు 3కిలో మీటర్ల దూరం వరకు ఐటీడీఏ కింద రూ.2కోట్ల నిధుల కింద మంజూరైన రహదారికి స్థానిక సర్పంచ్ మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో దాదాపుగా ఇప్పటి వరకు వివిధ గ్రామాల్లో 35 ఆలయాలను నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా మండలంలో అన్ని గ్రామాల్లో లక్షలు ఖర్చు చేసి సీసీరోడ్లు, మురికి కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దీంతో రంజిని గ్రామంలో ముఖ్యంగా తాగునీటి కొరత ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించి గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. దీంతో పాటు రంజిని తండా నుంచి పల్సి వరకు రూ.1కోటితో బీటీ రోడ్డు పనులు పూర్తి కావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలక రమణ, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, పీఏసీఎస్ చైర్మెన్ రేకుల గంగా చరణ్, వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, స్థానిక సర్పంచ్ రంగారావు, పద్మశాలి సంఘం అధ్యక్షులు సుధాకర్, చింతకుంట మల్లేష్, కాశీరాం, అశోక్, గ్రామస్తులు, ఐటీడీఏ డీఈ, జేఈ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీడీసీ చైర్మెన్ సభ్యులు ఉన్నారు.

ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బాసర

ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్మిక ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఛలో ఢిల్లీ చేపడుతున్నామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నవరత్నాలుగా పేరొందిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, ఉద్యోగులకు భద్రత లేకుండా చేస్తున్నారని తెలిపారు. బీజేపీ తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ఐక్యతతో ఉద్యమించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతులకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని, కౌలు రైతులకు సమగ్ర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి అల్లం సతీష్, నగేష్, దేవరావు, గంగాధర్, దేవన్న, అష్రఫ్, సారుబై, భారతి, భోజన్న, నాగరాజు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ : రాథోడ్ బాపురావు



నవతెలంగా-సిరికొండ

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సిరి సంపదల సొసైటీ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతుల అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు, రైతు బీమా, రైతుబంధు పథకాలను ప్రవేశపెట్టడంతో దేశం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని తెలిపారు. మండలంలో గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి అందరు కలిసిమెలిసి మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. త్వరలోనే అర్హులైన వారందరికీ గృహలక్ష్మి పథకం కింద 3లక్షల రూపాయలు అందజేస్తామని, దళిత బంధు పథకాన్ని మండలానికి మొదటి విడతగా 20 మందికి అందజేస్తామని అన్నారు. మండలంలో పలు సమస్యల గురించి స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్మద, సిరికొండ, సొంపల్లి ఎంపీటీసీలు పర్వీన్, సూర్యకాంత్, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న , బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి కిరణ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాలాజీ, సిరి సంపదల సొసైటీ చైర్మెన్ ప్రకాష్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు పెంటన్న, ఇక్బాల్, బియ్యాల మల్లేష్, గంగాధర్, కదం సూర్యకాంత్, విలాస్, ఈశ్వర్, గొర్ల శంకర్, లతీఫ్ పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస దీక్షలకు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఉపవాసదీక్షలకు పవిత్రమాసమైన రంజాన్ మాసంలో ముస్లీంలకు పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, మైనార్టీ నాయకులు షబ్బీర్ పాషా, హమానుల్లాఖాన్, మౌలానా మోయిోద్దీన్, అంజాద్ ఖాన్ మంగళవారం మున్సిపల్ కమీషనర్‌కు లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. రంజాన్ మాసం పూర్తయ్యే వరకు పట్టణంలోని ఈద్గా, కబ్రస్తాన్ పరిసరాల్లో ప్రత్యేక విద్యుత్ బల్బులను ఏర్పాటు చేయాలని తెలిపారు. మైనార్టీలు అధికంగా ఉన్న సభాష్‌నగర్, బర్కత్‌పురా, మొగల్‌పురా, కరీం కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్ల శుభ్రత చర్యలు చేపట్టాలని అన్నారు. మజీదులవద్ద క్లోరినేషన్ చేయాలని, ఆయావార్డుల్లోని ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఎదురవకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

వరల్డ్ విజన్ సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరల్డ్ విజన్ సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కవితారెడ్డి అన్నారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని 15 అంగన్‌వాడీ కేంద్రాలకు బరువు తూచే మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వరల్డ్ విజన్ సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పక పెరుగుదలను పరిగణలోనికి తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా వరల్డ్ విజన్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు మండలంలోని అనేకమందికి మేలు చేస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యవతి మాట్లాడుతూ మిగిలిన అన్ని కేంద్రాలకు ఇదే విధమైన బరువుతోచే మిషన్లను సరఫరా చేయాలని కోరారు. వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మన్న మాట్లాడుతూ బాలబాలికల శ్రేయస్సు కోసం సంస్థ పనిచేస్తున్నదని ఇక ముందు కూడా చిన్నారుల అభ్యున్నతికి తోడ్పడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని యువకుడి మృతి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని సిర్గాపూర్ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం అర్ధరాత్రి 12:00 గంటల సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సుమారు(22) సంవత్సరాల యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ వ్యక్తికి సంబంధించిన ఎలాంటి వివరాలు తెలియడం లేదని, ఆయనపై ఉన్న దుస్తులు, వేశాధారణను బట్టి మతిస్థిమితం లేని వ్యక్తిలా కనబడుతున్నాడని ఎస్‌ఐ తెలిపారు. అతని రూపు చాయలను బట్టి శరీరం నలుపు రంగులో వుండి, ఎత్తు 5.7 ఫీట్లు ఉన్నాడని, చిరిగిన తెలుపు రంగు చొక్కా, చిరిగిన నీలం రంగు జీన్ ప్యాంటు దరించాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల పాటు మృతదేహాన్ని ఆస్పత్రిలో ఉంచనున్నట్లు తెలిపారు. సంబంధికులు, కుటుంబ సభ్యులు వస్తే వారికి మృతదేహాన్ని అప్పగిస్తామని పేర్కొన్నారు. రాకపోయినచో 48 గంటల తరువాత పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరికైనా ఇతని ఆచూకీ తెలిసినచో కింది 8712659517 ఎస్సై నెంబరుకు సమాచారం ఇవ్వగలరని తెలియజేశారు.

బకాయిల వేటలో బల్దియా

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో మున్సిపల్ పరిధిలో పేరుకుపోయిన బకాయిల వసూలును బల్దియా అధికారులు పనిగా పెట్టుకున్నారు. మంగళవారం జరగాల్సిన ప్రజావాణిని సైతం ఉన్న పళంగా నిలిపివేసి వసూలులో తలమునకలయ్యారు. సమస్యలను విన్నవించుకోవడానికి మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అర్జీదారులు ప్రజావాణి విభాగానికి వేసిన తాళం చూసి వెనుతిరిగారు. వారం పాటు పుర ప్రజావాణి ఉండదన్న ముందస్తు సమాచారం లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుండి అర్జీలను అందజేయడానికి వచ్చిన వారికి మాత్రం నిరాశ తప్పలేదు. అధికారుల తీరుపై అర్జీదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను సంప్రదించగా ఉదయం వరకు ప్రజావాణిని నిర్వహించాలా? లేదా? అనే సందిగ్ధం నెలకొందని, ఉన్నతాధికారుల ఆదేశానుసారం చివరికి వారం నిలిపివేశామని చెప్పారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని నవయువ కాలనీకి చెందిన వృద్ధురాలు అడిగాం నర్సమ్మ ఇల్లు సోమవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోవడంతో మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు నీలబాయితో కలిసి బాధితురాలిని పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కలెక్టర్‌ని కలిసి బాధితురాలికి తక్షణమే షెడ్డు ఏర్పాటు చేయించాలని, అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌తో మాట్లాడి సహాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీజ, మాజీ ఎంపిటిసి కళ్లెం దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దేగల భీమన్న, శంభుగూడ సర్పంచ్ శంభు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-నస్పూర్



చిరుధాన్యాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగపూర్-2 కేంద్రాల్లో పోషనపక్షం కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల వాడకంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు పోషక విలువలపై వివరించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, సుమలత, కవిత, శేషమ్మ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 29 మార్చి 2023

ప్రణాళిక ప్రకారమే భర్త హత్య

నవతెలంగాణ-కాసిపేట

తాగుడుకు బానిసైన భర్త లేకుంటేనే మనశ్శాంతి ఉంటుందని భావించిన భార్య పథకం ప్రకారం హత్య చేసిందని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. కోనూర్ తంగళ్లపల్లి గ్రామంలో దుంపటి మహేష్ హత్య వివరాలను సీఐ మంగళవారం దేవాపూర్ పీఎస్‌లో ఎస్ఐ విజయేందర్‌తో కలిసి వివరించారు. 14 ఏళ్ల క్రితం దుంపటి మహేష్, లావణ్యకు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్ని సంవత్సరాలుగా భర్త తాగుడుకు బానిసై భార్యను హింసిస్తున్నాడు. కుటుంబీకులు సర్ది చెప్పిన ఆయనలో మార్పు రాలేదు. భర్త హింసలు భరించలేక చంపితే తప్ప మనశ్శాంతి ఉండదని భావించింది. అవకాశం కోసం ఎదురు చూస్తుండగా 26న సాయంత్రం భర్త తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ముందస్తు ప్రకారం ఇంట్లో ఉన్న ఇనుప రాడ్‌తో భార్య భర్త తలపై గట్టిగా కొట్టగా తల పగిలి మృతి చెందాడు. ఇనుప రాడ్‌ను ఎవరికి దొరకకుండా ఇంట్లోనే దాచి పెట్టింది. లావణ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు.

జల సంరక్షణతోనే మానవ మనుగడ

- ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

స్వచ్ఛమైన జలంతోనే మానవ మనుగడ సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పోటీలు, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నీరు, పారిశుధ్య సమస్యల సాధనలో మార్పును వేగవంతం చేద్దాం' అనే అంశం మానవ జీవితంలో ముఖ్యమైందన్నారు. ప్రభుత్వాలు పర్యావరణ కార్యక్రమాలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు నీటి కోసం చేస్తున్న సంరక్షణ చర్యలను గురించి వివరించారు. విద్యార్థి లోకం పరిశుద్ధమైన ప్రకృతిని కాపాడటంలో కార్యకర్తలుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.జైకిషన్ ఓజా మాట్లాడుతూ జలసంరక్షణ చర్యలలో మన కాలేజీ భాగస్వామ్యం మరువలేదన్నారు. జలసంరక్షణపై ఉపన్యాస, పోస్టర్ ప్రజంటేషన్ షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహించామని తెలిపారు. ఉపన్యాసంలో హర్షవర్ధిని వినీత్, యశస్విని షార్ట్ ఫిలింలో ప్రేమ కుమార్, వినీత్, అఖిల్, పోస్టర్ ప్రజంటేషన్‌లో జ్యోతిక, సౌమ్య, మౌనికలు బహుమతులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ గంగయ్య, అధ్యాపకులు కుమారస్వామి, సవిత, డా.సురేష్. డా.శ్రీలత, మంజుల, డా.రాజ్ కుమార్, శ్రీనివాస్, డా,చంద్రశేఖర్, సంధ్యారాణి, కవిత, సత్యానారాయణ మహేష్ కుమార్, సతీష్, విజయ్, చెన్నూరు కళాశాల అధ్యాపకులు సర్వర్ పాషా పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

పేదవారికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలిని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు ఎస్‌కే అబ్దుల్లా డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఇంటి స్థలాలు పేదవారిని గుర్తించి అందిస్తాము కానీ ఎవరు కూడా ప్రభుత్వ భూములలో అక్రమంగా గుడిసెలు వేసుకోవద్దని సూచించారు. ఈ ర్యాలీలో మురిమడుగు పంచాయతీలోని సోముగూడెం, ధర్మారం పంచాయతీ గోండుగూడా, బాదాం పెల్లి దోబి గూడా, బాదంపెల్లి, చింతలపల్లి, బీసీ కార్మికులు, దేవుని గూడా పంచాయతీలోని గడ్డం గూడా, పొనకల్, కిష్టాపూర్, కొత్తపేట కొలాంగూడ, గ్రామాలకు చెందిన నిరుపేదలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఒడిపల్లి అంజయ్య మగ్గిడి జయ, ఒడిపల్లి నాగరాజు, ముదాసీర్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు యశోద, హజీరా బేగం, పరాచ గిరిజా బాయి, మెట్పల్లి అమ్మాయి పాల్గొన్నారు.

కంచెను తొలగించిన అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ గ్రామ శివారు సర్వేనెంబర్ 119 లోని భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సమాచారం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మంచిర్యాల ఆర్డీఓ వేణు, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, నస్పూర్ తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో కంచెను తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొన్కల్ వారసంత వేలం పూర్తి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వారసంతకు సర్పంచ్ జక్కు భూమేష్, ఈట రాహుల్ ఆధ్వర్యంలో మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో రూ.6 లక్షలకు బీర వేణి గంగన్న వార సంతను దక్కించుకున్నారు. అలాగే దినసంతను రూ.2.86లక్షలకు ముడుగు ప్రవీణ్ కుమార్ దక్కించుకున్నారు.

పౌష్టిక ఆహారం తప్పనిసరి తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు సమతుల్యమైన పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ దూట సుశీల, అన్నారు. మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఇప్పలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో, చిరుధాన్యాలపై సమతుల్యమైన ఆహారంపై గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల రక్తహీనతకు గురికాకుండా ఉంటారన్నారు. పౌష్టికమైన ఆహారం తీసుకున్నట్లయితే పిల్లల్లో ఎదుగుదల మానసిక, రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ పోషణ పక్వాడ కార్యక్రమం మార్చి 20 నుంచి ఏప్రిల్ మూడవ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్, అంగన్‌వాడీ టీచర్లు, సవిట, కృష్ణవేణి, సురేఖ పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు లింగంపల్లి వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఐబీ ఆవరణలో లక్షెట్టిపేట్, దండేపల్లి, జన్నారం, హాజీపూర్ మండలాల వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏ లకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. అదే విధంగా రూ.10 లక్షల ఆరోగ్య భీమా, సెర్ప్ నుంచి ఉద్యోగ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అర్హులైన వీఓఏలను సీసీ లుగా ప్రమోషన్ ఇచ్చి కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గ వీఓఏల కమిటీ ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, పాల్గొన్నారు.



పేపర్ లీకేజీలపై విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి తిరుపతి



నవతెలంగాణ-నస్పూర్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించి, నిందితులపై చర్యలుతీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవరించిన ఛైర్మెన్, కార్యదర్శిని తోలగించాలని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని, భాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. గ్రూపు-1 పరీక్ష కూడా లీకైనట్లుగా వార్తలు వస్తున్నాయని తరుణంలో తెలంగాణ ఎర్పడిన నాటి నుంచి నియామకాలు లేక ఏన్నో యేండ్లుగా ఉద్యోగాల కోసం ఏదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులు ఈలాంటి చర్యలతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రూ.లక్షలు వెచ్చించి విలువైన సమయం కేటాయించిన లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నారన్నారు. బోర్డులో ఇంత జరుగుతున్నా కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన బోర్డు చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి, బోర్డు కార్యదర్శి పాత్రపైనా, సభ్యుల పాత్రపైనా విచారణ జరిపించి వారిని తొలగించాలన్నారు. వీరితో పాటు బోర్డులో వీరిని ప్రోత్సహించిన వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు చెవుటు మల్లేష్, నస్పూర్ మండల కార్యదర్శి ఈదునూరి అభినవ్, మండల నాయకులు వెంకటేష్, రాకేష్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- డీసీపీ సుదీర్ రాంనాథ్ కేకన్

నవతెలంగాణ-తాండూర్



యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీసీపీ రాంనాథ్ కేకన్ సూచించారు. మంగళవారం తాండూర్ సర్కిల్ పరిధిలో 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో క్రీడలపట్ల ఆసక్తి చూపడం లేదని, సెల్ ఫోన్‌లలో ఆటలాడితే శారీరక దారుఢ్యం కలగదని తెలిపారు. క్రీడలతో శారీరక దాడుర్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొంది ఆరోగ్యం బాగుపడుతుందని తెలిపారు. ఆటల వల్ల స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఎంచుకున్న లక్ష్యాల వైపు దృష్టి సారించాలని తెలిపారు. కష్టపడి చదివి ఆశయాల వైపు అడుగులు వేస్తూ అభివృద్ధిలోకి రావాలని తెలిపారు. తాను మహారాష్ట్రలోని 600 జనాభా గల చిన్న పల్లెటూరులో జన్మించి ఐఏఎస్ కాడర్‌లో ఉద్యోగం సాధించినట్టు తెలిపారు. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య మాట్లాడుతూ మహిళలు బాల్యంలో ఆకర్షణలకు లోనవ్వకుండా ఎంచుకున్న లక్షలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం మహిళల కోసం పోలీస్ శాఖలో ఉన్నతమైన ఉద్యోగాలు కల్పిస్తుందని తెలిపారు. ప్రజలతో యువతతో పోలీస్ శాఖ స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. అందుకుగాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. తాండూరు సర్కిల్ పరిధిలో క్రీడలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని వివరించారు. యువత మద్యం జూదం గంజాయి మారకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తు లక్ష్యాలవైపు అడుగులు వేయాలని సూచించారు. క్రీడాకారుడిగా సీఐ జగదీష్‌కుమార్ తాండూరు సర్కిల్లోని యువతకు అందిస్తున్న క్రీడా ప్రోత్సాహకం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా యువతీ యువకులకు 20 వాలీబాల్ కిట్స్, 10 క్రికెట్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి టౌన్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్‌గౌడ్, తాండూర్ ఎస్సై సమ్మయ్య, భీమిని ఎస్సై వెంకటేష్, కన్నేపల్లి ఎస్సై సురేష్, జడ్పీటీసీ బానయ్య పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు
- విద్యార్థులకు ప్యాడ్, పెన్‌ల పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బూరుగుడా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం సింగిల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, వసంతల కుమార్తె హిమాన్షి మొదటి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్, పెన్, స్కేల్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అబినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, నాయకులు పెంటయ్య, సురేష్, సదాశివ, సత్యనారాయణ, రమేష్, కుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు విజిత్ రావు విద్యార్థులకు సూచించారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు గొల్లపల్లి అజయ్ దండేపల్లి, లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ వితరణ చేయగా వాటిని నడిపల్లి విజిత్ రావు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు పెంట శ్రావణ్, గంగాధర్, కిరణ్, సుదీర్, తిరుపతి, శ్రీకాంత్, రాకేష్, హరీష్, సంతోష్ పాల్గొన్నారు.

నస్పూర్: సింగరేణి పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాలలో ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న వారికి శ్రీరాంపూర్ ఏరియా సంజీవరెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజ్, పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్ చేతుల మీదుగా ఎగ్జామ్ మెటీరియల్స్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ బడికి, బడి పిల్లలకు, పూర్వ విద్యార్థులకు సమాజానికి ఉపకరించే మరెన్నో సేవా కార్యక్రమాలు చేయాలని సంకల్పించి ముందుకు వెళుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దొనికెన సమ్మయ్య, కోశాధికారి డప్పు సమ్మయ్య, ఉపాధ్యక్షులు కే.శ్యాంసుందర్‌రెడ్డి, ఇతర సభ్యులు కే.తిరుపతి, పి.సురేందర్, నల్ల సంపత్, ఎస్.కుమారస్వామి, గోసిక మనోజ్, ఇరుకుళ్ళ ప్రవీణ్, కె.కృష్ణవేణి, రేఖ ఠాకూర్, షాహిద్, పి.అశోక్, ఓ.నర్సింగం పాల్గొన్నారు.



దండేపల్లిలో..

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కేసీఆర్

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నవతెలంగాణ-నస్పూర్



కంటి వెలుగు కార్యక్రమంతో సీఎం కేసీఆర్ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో స్థానిక కౌన్సిలర్ పూదరి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి చూపు సమస్యలు లేకుండా చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, మనం తినే రసాయన ఎరువులతో కూడుకున్న ఆహార పదార్థాల వల్ల కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, పట్టణ కౌన్సిలర్లు మల్లయ్య, మహేష్, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మి, డాక్టర్ రజిత, సీనియర్ నాయకులు రఫీక్ ఖాన్, రౌతు రజిత, బండి తిరుపతి, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రహారీ గోడను ప్రారంభించిన ఎమ్మెల్యే

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ కాలనిలోగల హనుమాన్ ఆలయ ప్రహారి గోడను ఆయన ప్రారంభించారు. సీడీపీ రూ.5 లక్షల నిధులతో ప్రహారి నిర్మాణం చేపట్టామని తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా ఆలయంలో పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాలయ కమిటీ సభ్యులు మల్లెత్తుల రాజేంద్రపాణి,

తోట సురేష్, టి.రవి, ఉపేందర్, శ్రావణ్, సంపత్, మల్లిక్, పూజారులు విజయ్ శర్మ, అజయ్ శర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని హాజీపూర్ తహసీల్దార్ రాజలింగం హెచ్చరించారు. మంగళవారం ముల్కల్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల పోచంపాడ్ శివారు సర్వేనెంబర్ 94లో దాదాపు 12 ఎకరంల ప్రభుత్వ భూమిని కొంతమంది ఇళ్ల స్థలాలు, ఇండ్లు ఉన్నప్పటిని కూడా ప్రభుత్వ భూమి ఖాళీగా వుందని భూ అక్రమనదారులు రాత్రికి రాత్రే ట్రాక్టర్లు, జేసీబీలతో చెట్లు, మొక్కలు తొలగించి ఆక్రమించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజలింగం సిబ్బందితో తో కలిసి ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ముగిసిన జనరల్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు జనరల్ ప్రథమ సంవత్సర పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ వివరాలు వెల్లడిస్తూ ప్రథమ సంవత్సరం జనరల్ కెమిస్ట్రీ, కామర్స్ మరియు ఒకేషనల్ పరీక్షలు జరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ 4387, ఒకేషనల్ 648 మొత్తం 5035 మంది విద్యార్థులకు గాను జనరల్ 4168, ఒకేషనల్ 569 మంది మొత్తం 4737 మంది విద్యార్థులు హాజరయ్యారని, 298 మంది గైర్హాజరయ్యారన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కళాశాలలను డీఈసీ బృందం పర్యవేక్షించిందన్నారు. పరీక్షల్లో విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి పరిశీలించారు. రికార్డులు సకాలంలో నమోదు చేస్తూ, ఎప్పటికప్పుడు గైర్హాజరు విద్యార్థుల బార్ కోడ్ స్కానింగ్ పూర్తి చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించడానికి డీఈసీ బృందం, 1 ఫ్లయింగ్ స్క్వాడ్ త్రిసభ్య టీం, 4గురు సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించినట్లు తెలిపారు.

మంచిర్యాల జిల్లాలో అడుగు పెట్టిన బట్టి యాత్ర

- ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-తాండూర్

సీఎల్పీ నేట బట్టి విక్రమార్క చేపట్టిన పాద యాత్ర మంగళవారం మంచిర్యాల జిల్లాలో అడుగు పెట్టింది. తాండూర్ మండలం రేపల్లేవాడ మీదుగా కన్నాల ఫ్లైఓవర్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎల్పీ నేట మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ తమ అధినేత రాహుల్ గాంధీపై కక్ష సాధుపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విదానాలకు పాల్పడుతూ ప్రజా దనాన్ని పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. రాబోవు కాలంలో బీజేపీ ప్రభుత్వానికి గునపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు సీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ స్వాగతం పలికారు. ఈ యాత్ర రేపల్లెవాడ నుంచి ఐబీ తాండూర్, ఇందిరానగర్, తంగేళ్లపల్లి, కృష్ణంపేట్, బోయపల్లిబోర్డు, బోయపల్లి, కన్నాల ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు సాగింది. ఆడు అడుగున మంగళ హారతులతో బ్రహ్మరథం పట్టారు. దారి పొడవున ప్రజలకు అభివాదం చేస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు, బెల్లంపల్లి కోఆర్డినేటర్ మదన్మోహన్ రావు, సూరం రవీందర్‌రెడ్డి, గట్టు మురళీధర్, కాపర్తి సుభాష్ మాసాడు ప్రభాకర్, భీమ లింగయ్య, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ అన్నారు. బాబాపూర్ రోడ్డులో అంకుశాపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల పనులను ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల నిర్మించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా మారుమూల ప్రాంతాలైన ఆదివాసీ, పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. ఆదివాసీ జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేయడం సంతోషంగా ముఖ్యమంత్రికి, వైద్య శాఖ మంత్రికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, స్థానిక సర్పంచ్ బలిరామ్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రామాలయంలో రామనవమిని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన నిర్వహించే సీతారాముల కల్యాణమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారాముల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ ప్రాంతంలో రెండో భద్రాద్రిగా పేరుగాంచిన జంకాపూర్ శ్రీ కోదండ రామాలయం అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతిఏటా భక్తుల సహకారంతో కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వేద పండితుడు నిమ్మకంటి సంతోష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సిరిపురం భద్రయ్య, చిలుకూరి రవి, పత్రే గిరి, గాజర్ల శైలేందర్, శివ చందు, రాకేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లను, జామెట్రీ బాక్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చదవాలని, పరీక్ష సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, దహెగాం ఎస్ఐ సనత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెందూర్ అమృత్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ నర్మద పెంటన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి సమస్యలు ఏవైనా ఉంటే ఉచితంగా అద్దాలను అందజేస్తారని అన్నారు. అనంతరం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉపసర్పంచ్ తోకల చిన్న రాజన్న, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు షాదీముబారక్, కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ గంద్రత్ రమేష్ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద ప్రజలకు అండగా ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో గిరిజన గూడేలు, లంబాడి తండాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార గణేష్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, కుమ్ర రాజు, గంగయ్య, రమణ, కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్‌చ సర్పంచులు విట్టల్, అశోక్, రతన్, సచిన్, శ్రీనివాస్, సుభాష్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం సమావేశం



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ లో మంగళవారం మండల మున్నూరుకాపు సంఘం సమావేశాన్ని మండల అధ్యక్షుడు అగ్గి సత్తయ్య పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్ట లక్ష్మణ్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం మండల పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కొమ్ము సతీష్ పటేల్, ఉపాధ్యక్షులుగా మచ్చ అనిల్ పటేల్, ఉస్కమల్ల గోపాల్ పటేల్, కోశాధికారిగా చింతల భీమయ్య పటేల్, ప్రచార కార్యదర్శిగా సూరం సంపత్ కుమార్ పటేల్, అధికార ప్రతినిధిగా పెద్దపల్లి శంకర్ పటేల్, గౌరవ అధ్యక్షులుగా మడిపెల్లి తిరుపతి పటేల్, ముఖ్య సలహాదారులుగా నారిశెట్టి వెంకన్న పటేల్, కార్యవర్గ సభ్యులుగా సిద్ధం శంకర్ పటేల్, పానగంటి రాజేశం పటేల్, కూకట్ల దేవేందర్ పటేల్, పెద్దపల్లి సత్తయ్య పటేల్, పోతురాజుల మల్లేష్ పటేల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మిట్ట లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధి కోసం కలిసికట్టుగా ఉండి హక్కులను సాధించుకోవాలని పేర్కొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు

నవతెలంగాణ-నిర్మల్

సోషల్ మీడియాలో ప్రార్థన స్థలాలు, దేవాలయాలపై రెచ్చగొట్టే పోస్టులు పెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్ మాసం పండుగలను పురస్కరించుకొని మంగళవారం శ్రీరామ నవమి రాలీ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలతో విడివిడిగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ర్యాలీలు, రంజాన్ పండుగలను మతసామరస్యంతో స్నేహపూర్వకంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరు కూడా సోషల్ మీడియాలో వస్తున్నటువంటి పుకార్లను, వివిధ పోస్టులను నమ్మి ఆవేశాలకు లోనై శాంతి భద్రతలకు భంగం కల్గించొద్దని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఎవరైన ప్రార్థన మందిరాలు, దేవాలయాలను ఎడిట్ చేసి, మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టు, షేర్ చేసినా, ఫార్వర్డ్ చేసినా, వాట్సాప్ స్టేటస్‌గా పెట్టిన, రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజా శాంతికి భంగం కలిగించేలా పోస్ట్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లేష్, ఎస్ఐలు, మత పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని అన్ని గ్రామాల్లోని 154 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్‌లు పోషణ పక్షోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని జిన్‌గూడ అంగన్‌వాడీ సెంటర్‌తో పాటు వివిధ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్‌లు గర్భిణీ బాలింతలకు ఇచ్చే చిరుధాన్యాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సీబీఈ ఈవెంట్స్, అక్షరాభ్యాసం, శ్రీమంతం, అన్న ప్రాసన, లాంటి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేయి రోజుల ప్రాముఖ్యత గల ఈ కార్యక్రమాన్ని ప్రతి సెంటర్‌లో నిర్వహిస్తునట్లు ఇన్‌ఛార్జి సీడీపీఓ ఉమా పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రదీపిక, వందన, లక్ష్మి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అంగన్‌వాడీ టీచర్‌లు ఉన్నారు.

బెజ్జూర్ : చిరుధాన్యాలతో ఆరోగ్యం లభిస్తుందని ఎంపీటీసీ పుష్పలత అన్నారు. మంగళవారం సోమిని గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. బాలింతలు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ మాట్లాడుతూ రక్తహీనత కలిగిన పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకొనే విధంగా తల్లిదండ్రులు చూడాలని కోరారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని స్టాళ్ల ద్వారా ప్రదర్శించారు. అనంతరం మహిళలకు సీమంతాలు నిర్వహించారు. సోమినిలో గత 10 రోజుల క్రితం చనిపోయిన అబ్బాయి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాయి, సర్పంచ్ ఎలాది శారద, వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

మావల మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మావల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వాఘాపూర్ పదో తరగతి విద్యార్థులకు యువ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్‌లు, స్కేల్, పెన్నులని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువ నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యువ నేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తు దళాలు సకాలంలో సేవలందించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్





ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు సత్వర నిర్ణయాలు తీసుకొని సకాలంలో సేవలందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే తరుణంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం వెంటనే స్పందించి, సకాలంలో సహాయ పునరావాస చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమై చెరువులు, కుంటలు తెగిపోయే ప్రమాదం ఉంటున్నందున, సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారం అవసరమని అన్నారు. గతంలో బెల్లంపల్లి, ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాభావాల వలన ఏర్పడిన ఇబ్బందుల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమావేశంలో వివరించారు. జిల్లా యంత్రాంగం జిల్లా వైపరీత్యాల మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌తో సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల అధికారులకు జిల్లా నుండి అందిన సమాచారం మేరకు సకాలంలో నిర్ణయాలు తీసుకొని వెంటనే బయలు దేరి బాధ్యతతో సహాయ కార్యక్రమాలు అందించాలని అన్నారు. ఎన్నికల సమయంలో తమ ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతగా వ్యవరించాల్సిన అవసరం ఉంటుందని, ప్రజల ప్రాణాలను కాపాడటం, జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి కార్యక్రమాలు వెనువెంటనే నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. వచ్చే వర్షాకాలంలో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారం అందించేందుకు తక్షణ స్పందన అవసరమని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల రవాణాకు అత్యాధునికమైన వాహనాలను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని అన్నారు. ఆ ప్రాంత ప్రజల ప్రాణాలు కాపాడటం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కార్యక్రమాలు చేపట్టడం వంటివి వెనువెంటనే తీసుకోవాల్సిన చర్యలు ఉంటాయని అన్నారు. కరోనా సమయంలో వ్యాపారస్తులు, స్వచ్ఛంద సంస్థలు, అధికార యంత్రాంగం, వివిధ ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని అన్నారు. వారం రోజుల పాటు ఎన్డీఆర్ఎఫ్ టీమ్ చేపట్టిన కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా యువజన సంక్షేమ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటరమణ, ఆర్డీఓ రమేష్ రాథోడ్, అదనపు ఎస్పీ, పోలీస్, అగ్నిమాపక, స్వచ్ఛంధ సంస్థలు, బేల, ఆదిలాబాద్ గ్రామీణ మండలాల తహసీల్దార్లు, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం : ఎస్పీ సురేష్‌కుమార్



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా జీవితానికి ఎంతో అవసరమని, విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. క్రీడలు మనలో దాగివున్న శక్తి సామర్థ్యాలను, పోరాట పటిమను వెలికితీస్తాయన్నారు. మంచి అలవాట్లతోనే మన జీవితాన్ని అభివృద్ధి చేసుకోవాలని, యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలు వ్యాయామం, ఒత్తిడి, అలసటకు లోనుకాకుండా ఏకాగ్రతకు దోహదపడుతాయని పేర్కొన్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏ క్రీడలోనైనా, వృత్తిలోనైనా పైకి ఎదుగుతామన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రత కోల్పోకుండా పరీక్షలు రాసి ఉత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభించి వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ గంగాసింగ్, ఎస్ఐ విజయ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుంది

నవతెలంగాణ-తాంసి



బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం అంబుగామ గ్రామంలో నిర్వహించారు. మొదటగా మండల కేంద్రం నుండి వివిధ గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలతో పాటు ఎమ్మెల్యే మోటర్ సైకిల్ ర్యాలీ అంబుగాం వరకు నిర్వహించారు. కుమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు ముఖ్య అతిథులను శాలువాతో సన్మానించారు. పార్టీ కన్వీనర్ అరుణ్ కుమార్ సమావేశాన్ని ప్రారంభించగా వివిధ గ్రామాల సర్పంచ్‌లు కార్యకర్తలు పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గులాబీ జెండా పేదోడికి అండగా ఉంటుందని, పార్టీ కోసం పని చేసే నాయకులను కార్యకర్తలను పార్టీ ఏప్పటికి మరిచి పోదని అన్నారు. తాంసి మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం నా ధర్మం ఎన్నికలు సమీపిస్తున్నందున పగటి వేషాల పార్టీలు గ్రామాలకు వస్తారని వారితో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యకర్తలకు సమస్యలు ఉంటే నాదృష్టికి తిసుకురావాని పార్టీ చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. కప్పర్ల గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తూర్పాబాయి, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, పార్టీ కన్వీనర్ అరుణ్ కుమార్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, వెంకన్న, కృష్ణ, లింగారెడ్డి, రమణ, మహేందర్, ధనుంజయ్, గజనాన్, రఘు, నర్సింగ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దల కబ్జాలో శివారు ప్రభుత్వ భూములు

- బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి




నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ చుట్టూ పక్కల ఉన్న భూములను ప్రభుత్వ పెద్దలు కబ్జాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం మావల మండలంలోని బట్టి సవర్గాం పరిధిలోని సర్వే నెంబర్ 72లో నివసిస్తున్న ఆదివాసీలకు కనీస వసతులు కల్పించాలని గత ఇరవై రోజులుగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి కుమురం భీమ్‌గూడ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరాహార దీక్షలకు బీజేపీ రాష్ట్ర నాయకురాలు మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా అంటే ఆదివాసుల జిల్లా అని, అలాంటి జిల్లాలో ఆదివాసీలు కనీస సౌకర్యాల కోసం పోరాటాలు చేయాల్సి రావడం బాధగా ఉందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిదులు కల్పించుకొని వారికి కనీస వసతులు కల్పించాలని అన్నారు. ఒక వైపు అదిలాబాద్‌లో కొందరు నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే, మరోవైపు పేదలు ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేయల్సివస్తుందని అన్నారు. ఆదివాసులు చేస్తున్న ఈ పోరాటానికి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఆమె వెంట పార్టీ ఆదివాసీ నాయకులు గెడం లీలావతి రాము, చాహకటి కిరణ్, ఆనంద్, నాయకులు గటిక క్రాంతి కుమార్, గన్నోజి విజయ్, తాటి సతీష్, తోకల నరేష్, చల్లా వెంకట్ రెడ్డి, ప్రశాంత్ ఉన్నారు.

ప్రజలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజలకు నిరంతరం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అనేక ప్రభుత్వాలు పాలించినప్పటికీ పేదలకు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇలాంటి సంక్షేమ పథకాలు తీసుకరాలేదన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ సీఎం అయ్యాక పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలని లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలో అమలు చేసేందుకు కేసీఆర్ భారత రాష్ట్ర సమితితో ముందుకు పోతున్నారని తెలిపారు. కేసీఆర్‌ను ప్రజలందరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్ రావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం, పార్టీ నాయకులు అజీమోద్దిన్, పోశన్న పాల్గొన్నారు.

తహసీల్దార్ పరీక్షా కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ విశ్వంబర్ సిట్టింగ్ స్క్వాడ్ వసియోద్దీన్, ఎంఈఓ చంద్రకాంత్‌తో కలిసి తనిఖీ చేశారు. రసాయన, వాణిజ్య శాస్త్రంలో మొత్తం 140 విద్యార్థులకు 138మంది హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ పి.సునీల్‌కుమార్, డిపార్ట్మెంట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

ఎంపీడీవో శివలాల్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎంపీడీవో శివలాల్ చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ గంద్రత్ రమేష్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటు చేశారు. శివలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, బీఆర్ఎస్ నాయకులు జగదీష్ యాదవ్, కుమ్ర రాజు, గంగయ్య, రమణ, ఎంపీడీవో శంకర్, ఎంఆర్ఐ ఆనంద్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ గణేష్ పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం విరాళం

నవతెలంగాణ-తాంసి



శ్రీరామ నవమి పండగ పురస్కరించుకొని భీంపూర్ మండలంలోని కరంజి-టి గ్రామ రామాలయానికి వన్నెల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళావారం అన్నదానానికి క్వింటాల్ యాభై కిలోల బియ్యాన్ని అందజేశారు. అన్నదానికి బియ్యం అందజేసిన వన్నెల ట్రస్ట్ కిష్టన్నను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. వారి వెంట నరేందర్ యాదవ్, నారాయణ పటేల్, రాజ్‌బలి ఉన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా సునారికారి రాజేష్

నవతెలంగాణ-కడెం

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9వ మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో 25, 26, 27 తేదీలలో జరుగగా, ఈ రాష్ట్ర మహాసభలలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సునారికారి రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకునందున ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్, రాష్ట్ర కార్యవర్గాన్ని కి ధన్యవాదాలు తెలిపారు. తాను కార్మికుల కోసం కార్మికుల ఉద్యమం కోసం ఎన్ని ఉద్యమాలు చేయడానికి అయినా సిద్ధమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వ్యతిరేక చట్టాలకు, వ్యతిరేకంగా, కార్మికుల హక్కులకోసం పోరాటం చేస్తానని అన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం కోప్టా చట్టం, 44కార్మిక చట్టాలలో సారాన్ని తొలగించి సెట్లకు అనుకూలంగా 4లేబర్ కోడ్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెచ్చి కార్మికులకు నష్టం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిడికార్మికులకు జీవనభృతి షరతులు లేకుండా రూ.3వేలను ఫించన్ ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాసే వ్యతిరేక చట్టాలకు ఉద్యమిస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-కడెం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు కన్నె శ్రీను ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ మంగళవారం చిన్న బెల్లాల్‌లో వారి ఇంటికి వెళ్లి కన్నె శ్రీనుని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు ఉన్నారు.

అడెల్లి పోచమ్మ ఆదాయం రూ.37.97లక్షలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.37లక్షల 97 వేల నగదు, మిశ్రమ బంగారం 290 గ్రాములు, మిశ్రమ వెండి 6 కిలోల 20 గ్రాములు సమకూరినట్లు ఆలయ చైర్మన్ చందు, ఇంచార్జీ ఈఓ రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళలు, ఆలయ ధర్మ కర్తలు, ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ చైర్మెన్లు మాదవ్‌రావు, లక్ష్మీ నారాయణగౌడ్, గ్రామ సర్పంచ్ సముద్రాల సుచరిత - రాజేశ్వర్‌రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాసర ఆలయ హుండీ ఆదాయం రూ.29లక్షలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం 150 రూపాయల అక్షరాభ్యాస మండపంలో ఆలయ ఈఓ విజయరామరావు పోలీస్ సిబ్బంది సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. ఈ లెకింపులో 29లక్షల44వేల395 రూపాయల నగదు, మిశ్రమ బంగారం 102గ్రాములు, విదేశీ కరెన్సీ 4డాలర్లు వచ్చాయి. ఈ ఆదాయం 28 రోజుల్లో సమకూరినట్లు ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, హోంగార్డ్స్, వాగ్దేవి సొసైటీ సభ్యులు శివరామకృష్ణ, భజన మండలి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వసతుల కల్పనకు కృషి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని ధర్మారం గ్రామంలోని మహా పోచమ్మ దేవస్థానం వద్ద రూ.20లక్షలతో మంజూరైన నూతన షెడ్ నిర్మాణానికి మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ ఆలయాలలో వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి కార్యక్రమలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, సర్పంచ్ కుర్మ రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీ తిప్పని రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ మల్లెల సుమన్ యాదవ్, కాంట్రాక్టర్ సురేష్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-తలమడుగు



ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం అయిన సంఘటన మంగళవారం భరంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భరంపూర్ గ్రామానికి చెందిన పుర్రె హేమ చిన గంగన్న ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. మంగళవారం ఉదయం ఎప్పటిలాగా ఉపాధి హామీ పనులకు వెళ్లగా ఇంటి నుండి పంటలు పొగ చెలరేగడంతో కాలనీవాసులు గమనించి నీళ్ల పోసి మంటలను ఆర్పి వేశారు. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులతో పాటు టీవీ వంట సామాగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు.సుమారు 70వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



నవతెలంగాణ-తాంసి

మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్థీఓ రాథోడ్ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థీఓ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మంచి భవిష్యత్తును రూపుదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సదానంద్, ఎంపీటీసీ సంతోష్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, ఎస్ఎంసీ చైర్మెన్ అనసూయ, ప్రధానోపాధ్యాయులు కిష్టన్న, ఉపాధ్యాయులు విలాస్ గౌడ్ పాల్గొన్నారు.

రక్తహీనతపై విద్యార్థినులకు అవగాహన

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని లక్ష్మంపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికల్లో రక్తహీనతపై ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత గురించి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సౌందర్య మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఆ హారాన్ని సరిగా తినకపోవడం వల్ల రక్తహీనత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్, హెచ్ఓ హరికుమార్‌గౌడ్, పోషణ అభియాన్ శివాజీ, సూపర్‌వైజర్ మంజుల, పాఠశాల టీచర్లు, అంగన్‌డీ టీచర్లు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి యత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మంగళవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. నాయకులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధితులను శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని, అప్పటివరకు తమ పోరాటం ఆగదని ఏబీవీపీ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కార్తీక్, జిల్లా హాస్టల్ కన్వీనర్ మడావి హరీష్ రెడ్డి, టౌన్ సెక్రెటరీ అక్షయ్, అజయ్, సాయిరెడ్డి, పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను మార్చ్ 31తేదిలో లోపల విడుదల చేయాలని జిల్లా తపస్ సంఘం నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రమేష్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, వలభోజు గోపి కృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ, కార్యదర్శి వడాస్కర్ నరేష్, నాయకులు గోపాల్ కాంబ్లె, కేశవ్, రాజ్ కుమార్, పృథ్వీరాజ్ ఉన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-కడెం

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని, బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి లబ్ధిదారునికి చేరాలని అన్నారు. తెలంగాణలో ఆడపడుచులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తూ ఆడపడుచుల తల్లిదండ్రులకు అండగా కేసీఆర్ ఉంటున్నారని అన్నారు. అలాగే రైతులకు అండగా రైతుబంధు, అమలు చేస్తూ రైతులకు భరోసాని ఇస్తున్నారని అన్నారు. అలాగే రైతు బీమా ద్వారా రైతులకు అండగా ఉంటూ రైతులకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరు సతీష్, ఏఆర్ఎస్ వ్యవస్థాపకులు అజ్మీర శంకర్ నాయక్, లింగాపూర్ సర్పంచ్ ఆకుల బాలవ్వ, ఎంపీటీసీ సరళ దేవి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్ గౌడ్, సారంగాపూర్ సర్పంచ్ రాజారెడ్డి, మాసాయిపేట సర్పంచ్ రాముగౌడ్, నచ్చన్ ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, దిల్దార్‌నగర్ సర్పంచ్ విజయ స్టీఫెన్, కొత్త మద్దిపాడగ సర్పంచ్ జాడి రాజమణి ఇందూర్, ఎలాగడప సర్పంచ్ సత్తవ్వ గంగన్న, లక్ష్మీసాగర్ సర్పంచ్ బేబీ రాజు నాయక్, నర్సాపూర్ సర్పంచ్ బాదురావ్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొనసాగుతున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు



నేటి జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయండి

● బహిరంగ సభ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-బాసర

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు మతోన్మాద, కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దుర్గం నూతన కుమార్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రంలో మూడు బస్సు జాతాలు బయలుదేరి అన్ని జిల్లాలలో బహిరంగ సభలు ఏర్పాటు చేసి బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ప్రజలకు వివరిస్తూ జన చైతన్య యాత్రలు విజయవంతంగా కొనసాగాయని అన్నారు. నేటితో జన చైతన్య యాత్ర ముగియనున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఈ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, గైని మురళీమోహన్, భైంసా ఏరియా కమిటీ సభ్యులు గైక్వాడ్ దేవిదాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

అధికారుల క్షేత్రస్థాయి సందర్శన

నవతెలంగాణ-ముథోల్



స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్ ఫేజ్-2 శిక్షణలో భాగంగా రెండో రోజు ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మంగళవారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది క్షేత్రస్థాయి సందర్శన చేశారు. క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా మల్లన్న దేవుని ఆలయ సమీపంలో విలేజ్ సోషల్ మ్యాప్‌ను వేసి సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా అన్ని శాఖల సిబ్బందితో బృందాలుగా ఏర్పాటు చేశారు. బృందాలు గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత మరుగుదొడ్లను ఉపయోగించే తీరును పరిశీలించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఆరుబయట మల విసర్జనతో వచ్చే వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా గ్రామంలో పారిశుధ్యంపై సైతం ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని అన్నారు. క్షేత్ర సందర్శన లోని వివరాలను ముగింపు రోజున శిక్షణ తరగతుల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లావణ్య రవీందర్ రెడ్డి, సర్పంచ్ స్వర్ణలత దత్తాత్రి, ముధోల్, బాసర ఎంపీడీఓలు సురేష్‌బాబు, నాగనాథ్, ఏపీఓలు సదానందచారి, శిరీష, రిసోర్స్ పర్సన్ గంగాధర్, ఉప సర్పంచ్ ఉదయ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఐకేపీ సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ దాదాపు 800 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ భారతరత్న అవార్డు గ్రహీత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయా ప్రభుత్వ పాఠశాలలో జరగబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్యాడ్‌లతో పాటు పెన్నులు పంపిణీ చేశారు. అలాగే అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు విడివిడిగా ఏర్పాటు చేసి, 6, 7, 8, తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు తమ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులను అందజేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే విద్యార్థులు కష్టపడి చదివి, పరీక్ష సమయంలో బయాందోళనకు గురి కావద్దని, మంచి మార్కులతో ఉత్తీర్ణులై, తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఎర్ల అఖిల్, హరీష్, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీ ఏ సి ఎస్ చైర్మన్ పదం ప్రశాంత్, నాయకులు కొడపా విజయ్,ఎంపిటిసి కుగాది రావు, పాల్గొన్నారు.

బోథ్ బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్

బోథ్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక కోర్టులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా వామన్‌రావు దేశ్‌పాండే, సెక్రటరీ పంద్రం శంకర్, ఉపాధ్యక్షులుగా రూపేందర్‌సింగ్, జాయింట్ సెక్రెటరీ దమ్మాపాల్ ట్రెజరర్ ఆడెపు హరీష్, స్పోర్ట్స్ కుమ్మరి విజయ్, ను ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అధికారి కే.సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

నూతన వైద్య కళాశాల ఏర్పాటుపై మంత్రి జూమ్ మీటింగ్

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో నూతనంగా నిర్మిస్తున్న 9 వైద్య కళాశాల పనుల పురోగతిపై ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధించిన ఇంజనీరింగ్ ఏజెన్సీలోని ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, టీఎస్ఎంఐడీసీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లాలో ప్రస్తుత, కొనసాగుతున్న, సంబంధిత పనులపై వివరించారు. జిల్లా ఆస్పత్రిలో ప్రస్తుతం 100 పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 125 అదనపు పడకల ఏర్పాటు కోసం రూ.11 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టి 40 శాతం పూర్తి చేశామని తెలియజేశారు. మే 15 వరకు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మెడికల్ కాలేజ్ పనులు 55 శాతం పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. మిగిలిన పనులు మే 15 వరకు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వసతి సౌకర్యాల కొరకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని తెలిపారు. జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎంహెచ్ఓ ధన్‌రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అడెల్లిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి తండా సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ సీసీ రోడ్డు నిర్మాణంతో తండాలోని ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. తండాలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిల్లి దీపిక, సెక్రటరీ ప్రేమలత, నాయకులు పిల్లి నాగయ్య, ప్రేమ్‌సింగ్ నాయక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.20.97 కోట్లు మంజూరు

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని ఆయా రహదారుల అభివృద్ధికి రూ.20.96 కోట్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఉన్నారు. జీఓ నెంబర్ 72 నియోజకవర్గంలోని 20.85 కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, అటవీ దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.